

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ ఆదివారం పారాయణ ప్రారంభం ★

# శ్రీ సాయి లీలామృతము



## అధ్యాయము - 15

## సద్గతి

**జీ**వుడు మరణ సమయంలో స్మరించిన దానినే మరుజన్మలో పొందుతాడని శాస్త్రం. అందుకే పరీక్షిన్మహారాజు చివరి దశలో శుకుని నుండి భాగవతం విని ఉత్తమగతి పొందాడు. అందుకే కాశీవంటి క్షేత్రాలలో మరణించాలని ముసలితనంలో ఎందరో అక్కడకు చేరుతారు. సకల దేవతలూ తానైన సద్గురు సన్నిధిలో మరణించిన జీవులు గూడ తప్పక సద్గతి పొందుతాయి. అది ఎన్నో జన్మల పుణ్యఫలం. అందుకే సద్గురువులను 'జంగమ' (సంచరించే) తీర్థాలంటారు.

మద్రాసునుండి మానససరోవరానికి బయల్దేరిన విజయానందస్వామి దారిలో శిరిడీ వచ్చాడు. హరిద్వార్ నుండి వచ్చిన ఒక సన్యాసి ఆ యాత్ర కష్టమని చెబితే అతడా తలంపు విడిచాడు. తర్వాత బాబా అతణ్ణి చూస్తూనే కోపంతో, "ఈ దొంగ సన్యాసిని బయటకు గెంటండి! కష్టానికి వెరచేవాడు సన్యాసేగాడు" అన్నారు. అది విని విజయానందుడు సిగ్గుపడ్డాడు. రెండురోజుల తర్వాత అతని తల్లికి జబ్బు చేసిందని జాబొచ్చింది. వెంటనే అతడింటికి వెళ్ళడానికి బాబా అనుమతి కోరాడు. "ఇంత మమకారముంటే ఎలా సన్యసించావు? వసతి గృహంలో ద్వారాలు బంధించి, ఓర్పుతో, జాగ్రత్తగా వేచివుండు. దొంగలు సర్వం దోచుకుపోతారు. ధనము, శరీరము అశాశ్వతాలని గుర్తుంచుకో! సుఖాపేక్ష విడిచి నీ ధర్మంలో నిలు. నీ పూర్వపుణ్యమే నిన్నిక్కడకు తెచ్చింది. భాగవతం శ్రద్ధగా పారాయణ చెయ్యి. కృతార్థుడవౌతావు" అన్నారు బాబా. అతడు ప్రయాణం మానుకుని లెండీలో పారాయణ పూర్తిచేసాక, మూడవరోజున తన గదిలోనే బడేబాబా ఒడిలో వొరిగి ప్రాణం విడిచాడు! సాయి అతని దేహాన్ని ఒకరోజు ఆగి సమాధి చేయమన్నారు. కారణం భక్తులకర్థం గాలేదు! అతని మరణంలో ఏదో మోసముందని శంకించి పోలీసులొచ్చి విచారించారు. తర్వాత మోసమేమీ లేదని నిర్ణయించి ఆ శరీరాన్ని సమాధి చేయడానికంగీకరించారు, విజయానందునితో సాయి చెప్పిన 'వసతిగృహం' అశ్వాశ్వతమైన దేహమే! యమదూతలే దొంగలు, ఆయన మూయమన్న ద్వారాలు యింద్రియాలు, మనస్సు. పారాయణద్వారా భగవంతునిపై మనస్సు నిలిపి శరీరం విడవమనే బాబా చెప్పినది. అతడు తల్లిపై మమకారంతో చనిపోతే పతితుడైన సన్యాసిగా దుర్గతి పొందేవాడే. సాయి సన్నిధిని సద్వినియోగం చేసుకొనేలా సాయియే చూచుకోవలసి వచ్చింది.

హెచ్. వి. సాఠేవద్దనున్న మేఘుడనే వంట బ్రాహ్మణుడు ఎప్పుడూ శివస్మరణ చేసేవాడు. అతని మేలుకోరి సాఠే అతనిని శిరిడీ పంపాడు. దారిలో సాయి ముస్లిమని ఎవరో చెప్పడంతో అతడు సంకోచిస్తూనే శిరిడీ చేరాడు. సాయి అతనిని చూచి ఉగ్రులై, "ఈ వెధవను బయటకు గెంటండి. అతడేమో పవిత్ర బ్రాహ్మణుడు, నేను ముస్లిమ్‌ను! ఇక్కడికొస్తే అతడి ఆచారం మంటగలుస్తుంది!" అని కేకలేసారు. సాయి సర్వజ్ఞతకు మేఘుడాశ్చర్యపోయాడేగాని తన శంక తొలగక శిరిడీ నుండి వెళ్ళిపోయాడు. 'కాని సాయి వెళ్ళగొట్టదలచినది అతని శంకనే గనుక త్వరలో 'అతడు హృదయపరివర్తన చెంది, బాబా సాక్షాత్తూ శంకరుడన్న విశ్వాసం పొంది మళ్ళీ శిరిడీ చేరాడు.. నిత్యమూ నాలుగుమైళ్ళు నడచి, గోదావరీ జలం తెచ్చి, శిరిడీలోని దేముళ్ళకు అభిషేకం చేసి చివరకు మశీదులో సాయిని పూజించేవాడు. ఒకరోజు ఖండోబా ఆలయం మూసివుంటే అతడు తిన్నగా మశీదు చేరాడు.

కాని బాబా, "ఇప్పుడా మందిరం తెరిచారు. పూజించిరా! నిత్యక్రమం ఎప్పుడూ మార్చకూడదు" అన్నారు. అతడు వెళ్ళి చూచేసరికి ఆలయం తెరచివున్నది.

అలానే ఒక సంక్రాంతికి సాయిని సాక్షాత్తు శివునిలా అర్చించదలచి అతడు గోదావరి జలం తెచ్చాడు. "నేను ఫకీరును. నాకు స్నానం తగదు" అని ఆయనెంత చెప్పినా వినలేదు. చివరకు సాయి తమ తలను మాత్రమే అభిషేకించమన్నారు. కాని అతడు భక్త్యావేశంతో, "హరహర మహదేవ!" అంటూ నీరు వారిపై కుమ్మరించాడు. అయినా వారి తలమాత్రమే తడిసింది.

అతడు తన గదిలో బాబా పటాన్ని గూడ పూజించేవాడు. ఒకరోజు తెల్లవారుఝామున అతడు మెలకువగా కళ్ళు మూసుకొని పడుకొన్నప్పుడు అతని మనోనేత్రానికి సాయి స్పష్టంగా గోచరించి, అక్షింతలు చల్లి "గోడమీద త్రిశూలం గీచి అర్చించు" అన్నారు. కళ్ళు తెరిచేసరికి యెవరూ లేరు. గది తలుపులు మూసేవున్నాయి. కాని అతని ప్రక్కమీద అక్షింతలున్నాయి! వెంటనే మేఘుడు బాబాను దర్శించి, ఆ విషయమై అడిగాడు. "నేను స్పష్టంగా చెప్పానుగదా! నా మాటలెన్నటికీ వ్యర్థంకావు. నేను యిళ్ళలోకి ప్రవేశించటానికి ఏ ద్వారాలూ అక్కరలేదు. నేను సర్వదా సర్వత్రా వున్నాను" అన్నారు సాయి. వెంటనే అతడు తన గది గోడమీద త్రిశూలం గీచి, పూజించాడు. మరురోజే పూణేనుండి వచ్చిన భక్తుడు సాయికొక శివలింగం సమర్పించాడు. సరిగ్గా సమయానికి మేఘుడు మశీదుకొచ్చాడు. సాయి శివలింగమతనికిస్తూ, "సాక్షాత్తూ శివుడే వచ్చారు. సేవించుకో!" అన్నారు. కాకాసాహెబ్ దీక్షిత్ సరిగా అదే సమయంలో గదిలో సాయిని స్మరిస్తుండగా అతనికి ధ్యానంలో ఒక శివలింగం కన్పించింది. కొద్దిసేపటికి అలాంటి లింగమే మేఘుడు తీసుకొచ్చాడు. నిత్యపూజ గూడ సద్గురువనుగ్రహంతోనే సఫలమవుతుంది.

మేఘుడు 1912లో చనిపోయాడు. సాయి ఆ శవాన్ని నఖశిఖ పర్యంతమూ నిమిరి, "ఇతడే అసలైన భక్తుడు!" అన్నారు. శవాన్ని తీసుకుపోతుంటే బాబా గూడ కొంత దూరం వెళ్ళి శవంపై పూలు చల్లి వచ్చారు. దహనమయ్యాక ఆయన సామాన్యునిలా శోకించి, తమ ఖర్చుతో అందరికీ సంతర్పణ కూడా చేసారు. తర్వాత అతడికిచ్చిన శివలింగాన్నే ఆయన గురుస్థానంలోని వేపచెట్టుక్రింద ప్రతిష్ఠించారు.

బల్వంత్ నాచ్నేకు చాలాకాలం సంతానం దక్కకుంటే ఆ దంపతులు 1915లో శిరిడీ వచ్చారు. నాచ్నే భార్యకొక కొబ్బరికాయ ప్రసాదించమని బాబాను వత్తిడి చేశాడు శ్యామా. అపుడు సాయి కన్నీటితో శ్రీమతి నాచ్నేకొక కొబ్బరికాయ ప్రసాదించి, నాచ్నేను తమ పాదాలొత్తమన్నారు. తర్వాత అతని వెన్ను నిమిరి అతనిని కౌగలించుకున్నారు. అతనికి 1919లో కొడుకు పుడితే కాలూరామ్ అని పేరు పెట్టారు. వాడు 3వ యేటనే 'హరేరామ్' అని జపిస్తూండేవాడు! హెగ్డే అను పండితుడు వాణ్ణి గమనించి అతడు శ్రీకృష్ణుని బాల్య మిత్రులలో ఒకడని చెప్పాడు. కాలూ కృష్ణునితో తన ఆటపాటల గురించి యేరోజేమి చెప్పేవాడో అదే ఆరోజు హెగ్డే చేసే 'హరి విజయము' పారాయణలో వచ్చేది. "కృష్ణుడు నన్నేడిపించేవాడు. అతడు నా వీపుపైనెక్కి, నేను అతని కాలు గిచ్చి పైకి చూచేసరికి నా ముఖాన వెన్న కొట్టేవాడు" ఇలా చెప్తుండేవాడు కాలూ. అప్పుడప్పుడతడు తలపై గుడ్డ కప్పుకొని కళ్ళు పైకిత్రిప్పి యోగిలా కూర్చునేవాడు. ఒకరోజు 'సందేశ్' అనే పత్రికను తెప్పించి, దాని అట్టమీద ప్రణవంలోనున్న శ్రీకృష్ణుని బొమ్మ గోడ కంటించాడు. ఆ పుస్తకంలోని ఒక వ్యాపార ప్రకటనలో గ్రాంఫోన్ముందు కూర్చున్న కుక్కబొమ్మ చూపి, "అది శ్రీకృష్ణ సందేశం - ఆ కుక్క దాని యజమాని వాణి ఎంత శ్రద్ధగా వింటుందో! అలా చేస్తే నీకూ బాబా మాటలు విన్పిస్తాయి. నేనలాగే చేస్తుంటాను" అన్నాడు కాలూ. "బాబా గొంతు నీకెలా తెలుసు!" అంటే అతడు చెప్పలేదు. అతనిని చూడ్డానికి మహాత్ములు, ఉపాసనీ బాబా మరియు గాడ్గే బాబా (అంధేరీ) వచ్చారు. కాలూకు 1927లో వంటికి నీరుపట్టి జ్వరమొస్తే బాబా ఊదీ మాత్రమే యిచ్చారు. పవిత్రమైన కార్తీక శుద్ధ ఏకాదశినాడు అతడు

తండ్రితో "జ్ఞానేశ్వరి' 13 వ అధ్యాయం విన్పించు. నేను వెళ్ళిపోతున్నాను" అన్నాడు. తండ్రి దుఃఖంవలన చదవలేకపోతే, అతడా గ్రంథాన్ని చూస్తూ ప్రాణం విడిచాడు. వెనుక కొబ్బరికాయ ప్రసాదించేటప్పుడు సాయి కన్నీరెందుకు కార్చారో నాచ్నేకు అర్థమైంది.

సం॥ 1914లో ఒకరోజు సాయి గర్భిణియైన శ్రీమతి రేగేతో "నా వరప్రసాదం నీ దగ్గరున్నది" అన్నారు. బిడ్డ జన్మించాక ఆయనొకరోజు, "బిడ్డ నీవాడా, నావాడా?" అన్నారు. "మీవాడే" అన్నాడు రేగే. "వాణ్ణి నావాడుగా పెంచు" అన్నారు బాబా. రెండోయేట ఆ బిడ్డ మరణావస్థలో వుండగా రేగే, "బాబా! ఈ బిడ్డ కర్మశేషం నాకిచ్చి, వాడికి మీ పాదాల చెంత ఆత్మశాంతి ప్రసాదించండి!" అన్నాడు. అదే విశ్వాసమంటే. వెంటనే ఆ బిడ్డ చిరునవ్వుతో యోగిలాగా బ్రహ్మరంధ్రం గుండా ప్రాణం విడిచాడు! ఆ తర్వాత వారు శిరిడీ వెళ్ళినపుడు రేగే గురించి, "ఆ బిడ్డ నావాడు; ఇతని ప్రార్థననుసరించి ఆ బిడ్డను శాశ్వతంగా నా హృదయంలో వుంచుకున్నాను" అన్నారు బాబా.

ఒకప్పుడొక అంధుడు తనకు దృష్టి ప్రసాదించమని ఎంత ప్రార్థించినా బాబా పలుకలేదు. అతడు ఖండోబా ఆలయంలో ఉపాసనీ బాబాను దర్శిస్తే ఆయన, "ఈ వయస్సులో దృష్టివస్తే కోర్కెలు హెచ్చుతాయి. జ్ఞానం కోరుకో!" అన్నారు. అతడు మశీదుచేరి జ్ఞానమిమ్మని సాయిని కోరినపుడు, అతనిని శిరిడీలో వుండమన్నారు. నెలరోజులలోగా అతడు గొప్ప ఆధ్యాత్మిక పరిణతి చెంది ఆ క్షేత్రంలోనే మరణించాడు. "మరణించినది అతని భార్యే (అజ్ఞానం) గాని అతడుగాదు. అతడు సద్గతి పొందాడు" అన్నారు బాబా.

మహల్సాపతి సాయినెంతగానో సేవించాడు. కొన్ని సేవలు అతడు మాత్రమే చేసేవాడు. ఉదా: ఎప్పుడూ సాయివద్దనుండే ఇటుకపై, ఒక గుడ్డ, దానిపై దుప్పటి పరచి ప్రక్కవేయడం మాహల్సాపతి మాత్రమే చేసేవాడు. అతనికి సాయి సద్గతినిచ్చారు. సెప్టెంబరు 11, 1922 సోమవారం నాడు అతడు పూజచేసుకుని, "నేడు నా తండ్రి శ్రాద్ధానికి వంట త్వరగా చేయండి. నేడే నేను గూడ స్వర్గానికి వెళతాను" అన్నాడు. అందరి భోజనాలయ్యాక అతడు గూడ తాంబూలమేసుకుని, కఫ్నీ ధరించి, కుమారుడు మార్తాండ్‌కు తన దండమిచ్చి, "భక్తిమార్గంలో జీవించు" అని చెప్పి, 'రామా!' అని ప్రాణం విడిచాడు.

ఒక మేకకు, ఒక బల్లికు, ఒక పెద్దపులికి గూడ సాయి సద్గతెలా ప్రసాదించారో, వేరు అధ్యాయాలలో చూస్తాము. అలాగే ఒకరోజు శ్రీమతి జోగ్‌తో బాబా, "తల్లీ! బాగా నెయ్యివేసి పులగం వంటి మధ్యాహ్న ఆరతయ్యాక మీ దొడ్డివైపుకొచ్చే గేదెకు పెట్టు" అన్నారు. ఆమె పులగం చేసేసరికి దొడ్డివైపాక గేదెవచ్చి పులగం తిని చనిపోయింది. ఆమె భయపడుతూంటే బాబా, "నీకే దోషమూ లేదు. దాని చివరి కోర్కెతీరి మంచి జన్మకెళ్ళింది" అని అభయమిచ్చారు.

★★★